

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

శుక్రవారం 30 జనవరి 2026 6 పేజీలు



## ప్రపంచంలోనే
# అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బిజెపి

### - రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మన ఇందూరు మన మేయర్ నినాదంతో ముందుకెళ్దాం
### - 22 డివిజన్ నుండి బిజెపిలోకి భారీగా చేరికలు
### - బిజెపి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

నరేంద్ర మోడీ వరుసగా గత మూడు ధపాలుగా ప్రధానిగా దేశాన్ని పరిపాలిస్తూ ఏమాత్రం అవినీతి లేని దేశంగా భారతదేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్నారని ఇందూరు ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి అధ్యక్షతన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సమక్షంలో నగరంలోని 22వ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ పోతుల (మిగతా 2లో)



## వనం" నుండి "జనం"లోకి
# వనదేవతలు "సమ్మక్క సారలమ్మ"

### - గద్దెలకు చేరిన "సమ్మక్క సారలమ్మ" వన దేవతలు..
### - నిలువెత్తు "బంగారం"తో మొక్కులు
### - పూనకాలతో శివసత్తులు.
### - మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు.

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. కాగా బుధవారం గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమయ్యాయి. బుధవారం సారలమ్మ దేవతను గురువారం సమ్మక్క వన దేవతలను సమ్మక్క సారలమ్మ గద్దెలకు కోయ పూజారులచే డప్పు చప్పుళ్ల మధ్యన అంగరంగ వైభవంగా తీసుకువచ్చారు.







## నిరుపేదలకు సేవలందించే అవకాశం లభించడం
# అదృష్టంగా భావించాలి

### - వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**

నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తూ అంకిత భావంతో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులకు, సిబ్బందికి హితవు పలికారు. సమీ కృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ గురువారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీలు, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్వహణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసు కున్నారు. క్షేత్రస్థాయి నుండి మొదలుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన పనులను అంకితభావంతో సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పీ హెచ్ సి స్థాయిలో మెడికల్ ఆఫీసర్, సూపర్వైజర్, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తమ ఉద్యోగాన్ని దైవంతో సమానంగా భావించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా చర్యలు కఠినంగానే ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరు సక్రమంగా లేకపోతే, అది ప్రజా జీవనంపై పెను ప్రభావం చూపుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమిష్టిగా, సమన్వయంతో పని చేస్తూ సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి పి.హె చ్.సి, సబ్ సెంటర్లలో అన్ని రకాల ఔషధాలు, కనీస సదుపాయాలు అందుబాటులో (మిగతా 2లో)

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన
# జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

### - నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు
### - సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, మనోభావాలు కించపరిచే పోస్టులపై కఠిన చర్యలు

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం రోజున ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ. రాజేష్ చంద్ర సందర్శించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు పోలీస్ బందోబస్తును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో (మిగతా 2లో)



# ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బిజెపి

**(మొదటి పేజీ తరువాయి)**

పురుషోత్తం, అదే డివిజన్ నుండి తాటికొండ రాము, ఆకుల శ్రీనివాస్, రాజ్ కుమార్, గౌత ఆనంద్, కుందన్ శ్రీనివాస్ లతో పాటు సుమారు 200 మంది డివిజన్ వాసులు బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మన ఇందూర్ మన మేయర్ అనే నినాదంతో బిజెపి శ్రేణులు ప్రతి డివిజన్ లో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ అంటేనే అభివృద్ధి అని అభివృద్ధి అంటేనే బిజెపి పార్టీ అని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఎంపీ అరవింద్ గారు జిల్లాలో చేస్తున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై, మున్సిపల్ ఎన్నికలకు ముందు బిజెపి పార్టీలో చేరడం శుభపరిణామం అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఉజ్వల్ యోజన కింద గ్యాస్ సిలిండర్లు తక్కువ ధరకే అందివ్వడం, అలాగే చిరు వ్యాపారులకు ముద్ర లోన్ పథకం కింద లక్ష రూపాయల వరకు రుణ సదుపాయాలు అందివ్వడం, వాటి ద్వారా చిన్న, మధ్య తరగతి ప్రజలు స్వతహాగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ రుణాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఆయన అన్నారు. అదేవిధంగా కేవలం 14 రూపాయలతో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ రెండు లక్షల జీవిత బీమా కల్పించడం ప్రపంచంలో ఎక్కడా లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇక రాబోయే రోజుల్లో కచ్చితంగా మున్సిపల్ కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని ఈ చేరికల ద్వారా తనకు పూర్తి నమ్మకం కలుగుతుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ నుండి సుమారు 200 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బిజెపి పార్టీలో చేరారు. ఇదిలా ఉండగా 22వ డివిజన్ మహిళా మణులు రాబోయే రోజుల్లో బిజెపి వైపే తాముంటామని ఎమ్మెల్యే కి భరోసా కల్పించారు.

# ఆర్మూర్, భీంగల్ లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. నామపత్రాల స్వీకరణ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేశారా, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యా యి తదితర వివరాలను అడిగి తెలుసు కున్నారు. నామ పత్రాలు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఆర్మూ ర్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసా గుతున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో పలు లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, అనవసర తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని



సూచించారు. ఎక్కడైనా రీపోలింగ్ కు అవకాశం కల్పిస్తే, సంబంధిత మున్సిపల్ కమిషనర్లను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియలో నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. చివరి రోజైన శుక్రవారం అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు ఉన్నందున, ఎలాంటి గందం గోళానికి తావు లేకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. కాగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు, అన్ని పార్టీల వారు ఎన్నికల నియమావళిని తు.చ తప్పక పాటించాలని అన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులుగా. నామినేషన్లు దాఖలు చేస్తున్న వారు, నిర్ణీత గడువు లోపు బీ.ఫారం సమర్పించాలని, లేని పక్షంలో వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్లు ఉమా మహేశ్వర్, గంగాధర్, స్థానిక అధికారులు ఉన్నారు.

## వృధాగా...మిషన్ భగీరథ నీళ్లు

**సూర్య బాల్కొండ**



బాల్కొండ మండలం వన్నెల్ బి గ్రామంలోని 12 వార్డులో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ వల్ల నీళ్లు వృధాగా పోతున్నాయి... గత కొంత కాలంగా పైప్ లైన్ లీకేజీ అవుతున్న అధికారులు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. తక్షణమే మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తులు చేపట్టాలని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజ్ లో మిషన్ భగీరథ నీళ్లు లీకేజీ అయి తిరిగి మళ్లీ అందులోకే చేరుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వృధాగా పోతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ గురించి అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందించి త్వరితగతిన మండల స్థాయి అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అతివేగం తో బైక్‌ను డికోట్టిన బస్

**సూర్య బాల్కొండ / ముప్కాల్**



ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బస్ ధ్విచక్ర వాహనాన్ని దికొట్టగా ఒకరికి గాయాలయ్యాయి ముప్కాల్ ఎస్ఐ కిరణ్ పాల్ తెలిపిన వివరాల ప్రకారం ముప్కాల్ నుండి కొత్తపల్లి కి వెళ్లే దారిలో గల బైపాస్ రోడ్ అండర్పాస్ వద్ద నిర్మల్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు అతివేగంగా అజాగ్రత్తగా రావడం కారణంగా ముందు మోటార్ సైకిల్ పై వస్తున్న రాజేశ్వర్ గ్రామం ముప్కాల్ అను వ్యక్తిని ఢీకొట్టడంతో అతని కాలికి గాయం అయ్యింది వెంటనే అతనిని ఆర్మూర్ లోనీ అపర్ణ హాస్పిటల్ కు తరలించరు. ఇట్టి విషయంలో ఎస్ ఐ గార హాస్పిటల్ కి వెళ్లి ఫిర్యాదు తీసుకోని ధర్యాప్తు చేస్తున్నామని తేలిపారు.

## నామినేషన్ల ప్రక్రియ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

**- నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్న మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్**

**సూర్య,ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ గురు వారం ఎల్లారెడ్డి మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, భద్రతా చర్యలను, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులుకు , ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా నామినేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పోలీసులకు ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు, ఎల్లారెడ్డి పట్టణంలో శాంతిభద్రతల నిర్వహణ, బందోబస్తు చర్యలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ యస్. శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ డి రాజారెడ్డి, ఎల్లారెడ్డి ఎస్‌హెచ్‌ఓ మహేష్, ఎస్ ఐ. 2 సుబ్రమణ్య చారి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు సేవలందించే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రైవేటు, కార్పొరేటు హాస్పిటల్లకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. మాతా శిశు మరణాలు జరగకుండా ముందు నుండే గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు నర్సింగ్ హోం లలో కూడా సాధారణ ప్రసవాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

**(మొదటి పేజీ తరువాయి)**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది రావడం, నినాదాలు చేయడం లేదా ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేయడం, ఇతరుల మనోభావాలను కించపరిచేలా పోస్టులు పెట్టడం లేదా మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా కార్యాలయములో ప్రత్యేక బృందం ప్రతి పోస్టును నిశితంగా గమనిస్తుందని తెలియజేశారు. జిల్లాలో శాంతియుత, స్వేచ్ఛాయుత మరియు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని ఎస్పీ పునరుద్ఘాటించారు. శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించే వారిపై ఉపేక్షించే ప్రసక్తే లేదని, ప్రజలు లేదా అభ్యర్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ నామినేషన్ కేంద్రాల పరిశీలన కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్హెచ్ఓ నరహరి, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది ఇతర శాఖల సిబ్బందిపాల్గొన్నారు.

## మీడియా సెంటర్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ మధు మోహన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

మీడియా సెంటర్ ను ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు మోహన్, అదనపు కలెక్టర్ విక్టర్ కామారెడ్డి జిల్లా ఐడీఓసీ భవనంలోని 21వ గది నంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎం సి ఎం సి మీడియా కేంద్రాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు



కలెక్టర్/అదనపు ఎన్నికల అధికారి మధుమోహన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోజువారీ వివిధ దినపత్రికలు,చానళ్లలో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, వాటిని సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం మీడియా పర్యవేక్షణను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి తిరుమల, ఉర్దూ మైనారిటీ అధికారి మహ్మద్ అర్షద్ అలీ, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య..

**సూర్య రాజంపేట**



రాజంపేట మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మాలోత్ నవీన్ (25) కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య విషయమై మాలోత్ ప్రకాష్, అంబ్రియా, పోలి, శాంతిలతో గతంలో జరిగిన వివాదాలు, గొడవలు తనను తీవ్రంగా బాధించాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో నవీన్ తన స్వగృహంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతని తండ్రి మాలోత్ శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

# నిజామాబాద్లో యువతకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

**- బజాజ్ ఫైనాన్స్ 100 నగరాల సైబర్ భద్రతా కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్‌లో BFL అవగాహన డ్రైవ్**

**- సైబర్ మోసాల రకాలు, ఆర్థిక భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పౌరులకు అవగాహన**

**సూర్య ఇందూర్**

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ (BFL)-భారతదేశం లోని అతిపెద్ద ప్రైవేట్ రంగ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (NBFC) మరియు బజాజ్ ఫిన్సర్వ్ గ్రూప్‌లో భాగమైన సంస్థ-నిజామాబాద్‌లో 'నాక్అవుట్ డిజిటల్ ఫ్రాడ్' పేరుతో సైబర్ మోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. డిజిటల్ వినియోగదారులను పెరుగుతున్న సైబర్ ముప్పులు మరియు తమ ఆర్థిక వ్యవహారాలను ఎలా సురక్షితంగా ఉంచుకోవాలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. కాళిల్వాడిలోని SSR డిగ్రీ & పీజీ కాలేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై ఘనత వహించారు. నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ మహమ్మద్ మొకీద్ పాషా, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ బసవరాయ మానోహర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కళాశాల చైర్మన్ శ్రీ ఎం. మరయ్య గౌడ్‌తో పాటు అధ్యాపకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులు మరియు అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించిన వక్తలు-సైబర్ అవగాహన కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్న నిపుణులుగా పేరొందిన వారు-నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నకిలీ OTP మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్, లోన్ మోసాలు, పెన్షన్ మోసాలు తదితర ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మొకీద్ మాట్లాడుతూ, డిజిటల్ మోసాలు భయంకరంగా పెరుగుతున్నాయని హెచ్చరించారు. ధృవీకరణ లేని చైనా యాప్‌ల ద్వారా తక్షణ లోన్ల పేరుతో




ప్రజలను మోసం చేస్తున్న వాస్తవ సంఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ యాప్‌లకు అనుమతులు ఇచ్చిన తర్వాత వ్యక్తిగత సమాచారం ఎలా దుర్వినియోగం అవుతుందో వివరించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ పరికరాల్లో టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో భద్రతపై నమ్మకం పెంపొందించేందుకు, ఏదైనా ఆన్‌లైన్ మోసం ఎదురైతే వెంటనే సంప్రదించాలంటూ ఇన్‌స్పెక్టర్ మొకీద్ తన సంప్రదింపు నంబర్‌ను కూడా పంచుకున్నారు. ఈ సందేశాన్ని మరింత బలపరుస్తూ రిటైర్డ్ ఎస్పీ బసవరాయ మానోహర విద్యార్థులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "తెలియని లింక్‌లపై క్లిక్ చేయకండి, అపరిచితులతో OTPలను పంచుకోకండి. మీరు ఏదైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే, ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం చాలా ముఖ్యం. మేము మీకు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాము," అని ఆయన తెలిపారు. నాక్అవుట్ డిజిటల్ ఫ్రాడ్ కార్యక్రమం, NBFCల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) విడుదల చేసిన 2024 ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించబడింది. ఈ మార్గదర్శకాలు ముందస్తు గుర్తింపు, సిబ్బంది బాధ్యత, ప్రజల భాగస్వామ్యం ద్వారా డిజిటల్ ఎకోసిస్టమ్‌ను మరింత సురక్షితంగా మార్చడంపై దృష్టి సారిస్తాయి. ఈ కార్యక్రమం నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు, వాట్సాప్ గ్రూపులు, ఆర్థిక సంస్థల పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి మోసాలకు పాల్పడుతున్న స్కామర్లపై ప్రజల దృష్టిని ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధి మాట్లాడుతూ,"మా వినియోగదారుల ఆర్థిక భద్రత మాకు అత్యంత ముఖ్యమైనది. సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండేలా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సూచనలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని అందిస్తున్నాము," అని తెలిపారు. నాక్అవుట్ డిజిటల్ ఫ్రాడ్ కార్యక్రమం వ్యక్తిగత మరియు సున్నితమైన సమాచారాన్ని ఎలా రక్షించుకోవాలో సైబర్ వినియోగదారులకు విలువైన సూచనలు అందిస్తుంది. ఇందులో OTPలు, పిన్ నంబర్లు పంచుకోకపోవడం, అనుమానాస్పద ఈమెయిల్స్, కాల్స్, లింకులు, QR కోడ్‌లు క్లిక్ చేయకపోవడం, తెలియని వనరుల నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేయకపోవడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన నగరాలు మరియు పట్టణాల్లో ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, డిజిటల్ అవగాహన డ్రైవ్‌లు మరియు కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

**- ఎంపీడీవో అభినవ్ చందర్**

**సూర్య పెద్ద కొడప్గల్**



రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అభినవ్ చందర్ అన్నారు. పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా లో సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా అందని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్లు ఎస్ ఏఈ రాచప్ప ఎంపీఓ లక్ష్మి కాంత్ రెడ్డి సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ కళ్యాణానికి హాజరుకావాలని ఆహ్వానం

**సూర్య- బిక్కనూర్**



పెద్దమ్మ కళ్యాణానికి హాజరుకావాలని కోరుతూ గురువారం దోమకొండ మండలంలోని అంబార్ పేట్ గ్రామ ముదిరాజ్ సంఘ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మాజీ జెడ్పిటిసి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఫిబ్రవరి నాలుగో తేదీ జరిగే పెద్దమ్మ కళ్యాణానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబార్ పేట్ గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు కిష్టయ్య, పుట్ట రమేష్, రామయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు

## పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

**-మాజీ ఎమ్మెల్యే**

**సూర్య- బిక్కనూర్**



బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా నని, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చెప్పారు. గురువారం మండలం లోని పలు గ్రామాలలో ఆయన పర్యటించి పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. మొదటగా బాగిర్తి పల్లి మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల నాగ లక్ష్మి భర్త స్వామి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని, మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం అయ్యవారిపల్లి, జంగంపల్లి గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అతిలి శ్రీనివాస్, పెద్దమల్లరెడ్డి గ్రామ సర్పంచ్ కోడూరి సాయ గౌడ్, నాయకులు అందె మహేందర్ రెడ్డి, తునికి వేణు, బొండ్ల రామచంద్రం, భూమి రెడ్డి, గుడిసె యాదగిరి, పోతిరెడ్డి, నర్సారెడ్డి ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు ఉన్నారు.

## నూతన తాహసిల్దారు కు సన్మానం

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండల నూతన తాహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అనిరుద్ ను మీసేవ నిర్వాహకులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కు మీసేవ నిర్వాహకుల పరిచయాలను చేసుకున్నారు. అనంతరం వేల్పూర్ మండల మీసేవ నూతన క్యాలెండర్ ను తాహసిల్దార్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఆదేవిధంగా సర్వంక్ష ఫోరం ఆధ్వర్యంలో తహసిల్దార్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు మరియు సర్పంచుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

## జలాల్పూర్ గ్రామంలో వీధి దీపాల మరమ్మత్తులు పూర్తి

**సూర్య బాల్కొండ**



బాల్కొండ మండల కేంద్రంలోని జలాల్పూర్ గ్రామ వీధి దీపాలు వెలగడంలో ఇబ్బందులు తొలగిపోయాయి. స్థానిక సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ తీగల అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి మరమ్మత్తులు ఉన్న వాటినీ తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కారోబార్ వేణుగోపాల్, జే ఎల్ ఎం నరేందర్, వాటర్ మెన్ ప్రదీప్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు,

## పల్లె దావఖానా - స్థల పరిశీలన

**సూర్య మోపాల్**

మోపాల్ మండల్ బోర్గం (పీ) గ్రామంలోని పల్లె దవఖానా స్థలాన్ని ఆర్డీవో రాజేంద్ర కుమార్ పరిశీలించారు. నూతన పల్లె దావఖానా అందులోనే కొనసాగుతున్న శాఖా గ్రంథాలయ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. స్థల వివాదం కారణంగా నిర్మాణాలు ఆగిపోయాయి. పనులు చేపట్టకపోతే నిధులు వెనక్కి పోతాయని డిప్యూటీ డీఎంహెచ్ వో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఆదేశాల మేరకు ఆర్డీవో తో పాటు తహసీల్దార్ రేఖానాయక్, సర్వేయర్ స్వప్న, ఆర్ఐ రాజేశ్వర్, జీపీఏ వేణు స్థలాన్ని పరిశీలించారు. వైద్యుడు సంతోష్ కుమార్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్థలం వైద్య ఆరోగ్యశాఖ పేరున ఉందని చూపడంతో భూమి కొలతలు తీసి నివేదికలు అందించాలని సర్వేయర్ సూచించారు. ఘటన స్థలానికి గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మెన్ అంత రెడ్డి రాజారెడ్డి సైతం వచ్చారు. ఇప్పటి వరకు కొనసాగుతున్న భవన స్థలాన్ని గ్రంథాలయనికి ఇవ్వాలని కోరారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

**సూర్యలింగంపేట్**



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో గురువారం బాధితులకు మండల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మణిగిరి నాగరాజు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ ఆదేశానుసారం గ్రామానికి చెందిన గడ్డి సంగవ్వకు 25 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసుల కృష్ణమూర్తి,బండారి సంజీవరెడ్డి,అర్వారి ఆగమయ్య, చింతకుంట విష్ణు,ఆవుసుల రాజమౌళి,పొప్పన్నపేట దుర్గపతి,పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్య స్థాయి లను పెంచాలి

**సూర్య- బిక్కనూర్**



విద్యార్థుల సామర్థ్య స్థాయిలను పెంచాలని ఎంఈఓ రాజాగంగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా సంవత్సరం చివరి దశకు చేరినందున, ప్రత్యేక బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన దేవి, బస్వాపూర్ కాంప్లెక్స్ వెంకటేశ్వర్లు, ఆర్పీలు గోపి కృష్ణ,సిఆర్పీలు సత్యనారాయణ,ఈశ్వర్ మహేందర్,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాగిర్తిపల్లిలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని బాగిర్తిపల్లి గ్రామ శివారులో జాతీయ ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ గంగయ్యగారి నర్సింలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించడం జరుగుతుందని, ఉపాధి హామీ కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

# ఘనంగా సీఎం కప్ క్రీడల ప్రారంభం

**సూర్యకామారెడ్డిజిల్లా ప్రతినిధి**

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో సీఎం కప్-2026 క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడాభిమానులు, యువతలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. క్రీడల ప్రారంభోత్సవానికి మండల ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, దోమకొండ ఎస్ఐ ప్రభాకర్, ఎంపీఓ రవి హాజరై క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ , కోకో,తదితర ఆటలతో క్రీడా ప్రాంగణం క్రీడాకారుల ఉత్సాహ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా బద్దం



ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ ద్వారా గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, ఏఎస్ఐ జానీ పాషా, దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కదిరే గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచులు, పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. సీఎం కప్ క్రీడలు దోమకొండ మండల యువతకు కొత్త వేదికగా నిలుస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన నవ చండీ యాగం

**సూర్య ఇందూరు**

ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన దుబ్బా రోడ్డులోని మున్నూరు కాపు కళ్యాణ మండపం నందు నవ చండి యాగం నిర్వహిస్తున్నట్టు ఇందూరు జిల్లా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సంస్థ అధ్యక్షులు మద్దకూరి సాయిబాబు అన్నారు.లోక కళ్యాణర్ధం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా పాడిపంటలు సమృద్ధిగా పండేలా అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని చండీ యాగం నిర్వహించటం జరుగుతుందన్నారు. అలాగే ఇందూరు యువత స్వచ్ఛంద




సంస్థ చేస్తున్న సేవ కార్యక్రమాల్లో ముఖ్యమైన సేవ అనాథ శవానికి అంత్యక్రియలు ఇప్పటి వరకూ 157 అనాథ శవాలకి అంత్యక్రియలు పూర్తి చేసినట్టు తెలిపారు. శాస్త్రాలల్లో చెప్పినట్టు ఒక్క అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తే అశ్వమేధ యాగం తో సరిసమానమని ఇప్పటి వరకూ ఇందూరు యువత చేసిన అంతిమ సంస్కారాలు ఎన్నో యాగాలతో సమానమని అన్నారు.ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 6గంటలకు గణపతి పూజతో మొదలై మండపరదన,శివ పార్వతుల కళ్యాణము,శివ రుద్రబిశేకం, సామూహిక కుంకుమార్చన, చండీ హోమం, పూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.కావున ఇందూరు జిల్లా ప్రజలందరూ తప్పకుండా నవ చండీ యాగం లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరనీ కోరారు.

## బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన భార్య భర్తలు ముద్రకోల బాలరాజు,మంజుల లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను తీవ్రంగా కలిసిందని, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రమాదంలో గాయపడిన వారి కుమారుడు ముద్రకోల అభిలాష్ కామారెడ్డి మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని గురువారం బాలు డు అభిలాష్ యొక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు ఈ సందర్భంగా సంబంధిత డాక్టర్లను సంప్రదించి వారితో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇంద్రకరణ్ రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాగారెడ్డి, తుడుం స్వామి, సిద్ధి రాములు, జీవన్ తదితరులు ఉన్నారు.

## సీఎం కప్ క్రీడలు ప్రారంభం

**సూర్య పెద్ద కొడప్గల్**



మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం రోజున సీఎం కప్ ఆట పోటీలను ఎంపీడీవో అభినవ్ చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు అపార అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు క్రీడలను కేవలం పోటీలుగా కాకుండా, ఆరోగ్యకరమైన జీవన విధానంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహనం, జట్టు భావన పెంపొందుతాయని, గ్రామ పంచాయతీ తరఫున క్రీడా సౌకర్యాల మెరుగుదలకు పూర్తిస్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.విద్యతో పాటు క్రీడలు సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన మండల జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్, బస్వరాజ్ దేశాయ్, ఆయా గ్రామాల క్రీడాకారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు,పలువురుపాల్గొన్నారు

## గ్రామ సమాఖ్య ప్రతినిధుల కు సెర్ప్ స్టేట్ రిసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల ప్రతినిధులకు గ్రామ సంఘాల ప్రాతినిధ్యం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ లు జహీరా భాను, పర్వీన్ మాట్లాడుతూ ప్రతినిధులు గా పనిచేసే కాలంలో మీ పదవుల పై పూర్తి అవగాహన ఉండాలి ఆర్థిక పరమైన అంశాలు తప్పనిసారి తీర్మానం చేసి ఆమోదించాలని రికార్డ్స్ అన్ని మీ అధీనం లో ఉండాలి అదేవిధంగా అధ్యక్షురాలు ఉపాధ్యక్షురాలు కార్యదర్శి కోశాధికారి సహాయ కార్యదర్శి విధులు బాధ్యతలపై సుదీర్ఘంగా శిక్షణను ఇవ్వడం జరిగింది పేదరికంలో ఉన్న మహిళలను వారి కుటుం బాలను గుర్తించి వారికి ఉపాధి కల్పించాలని వారి కుటుంబాలలో వెలుగు లు నింపాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏపిఎం బత్తుల మాణిక్యం లు వెన్న మురళి సాయన్న రాధా సరళ లక్ష్మి అటువంటి మహేష్ మహిళ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం క ప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

**సూర్య వేల్పూర్**

సీఎం కప్పు పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న దృశ్యం ఈరోజు వేల్పూర్ మండల కేంద్రంలోని మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఇట్టి పోటీలను వేల్పూర్ తహసిల్దార్ శ్రీకాంత్ ఎంపీడీవో బాలకృష్ణ జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి ఎంతో పాటు పడతాయని అలాగే మానసికల్లసానికి తోడ్పడతాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించి జిల్లా రాష్ట్ర స్థాయిలో మండలానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు కళాబృందం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్నికల అవగాహన

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ .రాజేష్ చంద్ర ఆదేశానుసారం కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందంచే ఎన్నికలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఎలక్షన్ సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కులము వర్గము ప్రాంతీయ గొడవలు కాకుండా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని నేరాలకు పాల్పడకూడదని అత్యవసర సమయంలో డైల్ 100. కాల్ చేయాలని పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్,రామంచ తిరుపతి పిసి..సాయిలుపాటల మాటల ద్వారా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి కార్యక్రమం చేయడమైనది ఈకార్యక్రమంలో దేవునిపల్లి సబ్-ఇన్స్పెక్టర్..2 భువనేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే సీఎం కప్ క్రీడల్లో పాల్గొనాలి

**సూర్యలింగంపేట్**



నేడు జరగబోయే సీఎం కప్ క్రీడల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని మాత్రమే క్రీడల్లో పాల్గొనే విదంగా చూడాలని ఎంపీడీఓ నరేష్ పీఈటీలకు సూచించారు. అయన గురువారం లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయంలో పీఈటీలకు పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే సీఎం కప్ క్రీడలను ఎలాంటి గొడవలకు తావివ్వకుండా నిర్వహించాలని తెలిపారు.గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీయడం కోసమే ముఖ్యమంత్రి మండల స్థాయిలో సీఎం కప్ క్రీడలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఇట్టి క్రీడల్లో కబడ్డీ,కొక్కో,వాలీబాల్ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కబడ్డీ ఓపెన్ ఆటలో ఆడబోయే క్రీడాకారులు అబ్బాయిలు 85 కిలోల లోపు, అమ్మయిలు 75 కిలోల లోపు బరువు ఉండాలన్నారు.అంతకంటే ఎక్కువ బరువు ఉంటే క్రిడల్లో పాల్గొనవద్దన్నారు.కోకో,వాలీబాల్ అండర్ 18 సంవత్సరాల లోపు క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలన్నారు.ఈ సమావేశంలో పిఈటిలు రాజగౌడ్,శ్రీలత,రాజేందర్ రెడ్డి,కవిత,సంతోష్ కుమార్,సంతోష్ రెడ్డి,సంగమేశ్వర్,నవీన,లు పాల్కొన్నారు.

## కందకుర్తిలో టీబీ వైద్య పరీక్షలు

**సూర్య రెంజల్**



గ్రామాలలోని ప్రజలు టీబీ మహ మ్మారి వ్యాధులకు గురవుతున్నారని ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య పరీక్ష నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ షేక్ గయాసోద్దీన్ అన్నారు. గురువారం రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా టీబీ వైద్య పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు.టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి డా సుధాకర్ తెలిపారు. ప్రజలకు దగ్గు, దమ్ముతో బాధ పడుచున్న, గుట్కా సిగరెట్, బీడీ , జర్ధ, ద్వారా ఇబ్బందుల పడుచున్న వారికి రక్త , ఉమ్ము, ఇ-తీుఎ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అవసరమైన వారికి మందులు అందించామన్నారు.టిబి సోకిన వ్యక్తులు భయపడవలసిన అవసరంలేదు, 6మాసాలు మందులు వాడితే పూర్తిగా నయమవుతుంది. పోషకాహార పదార్థాలను తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, డాక్టర్ ప్రమోదిత టిబి సూపర్వైజర్ ఆషా,సూపర్ వైఎస్ఆర్ మాలింబి ఇమ్రాన్, లక్ష్మీనారాయణ, ఉజ్మ, టెక్నీషన్ సాయికిరణ్, కౌన్సిలర్ శివ, ఎక్రే టెక్నికల్ సురేందర్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల సమస్య పరిష్కరించాలి

**సూర్య-నవీపేట్**

అసైన్డ్ భూముల సమస్య పరిష్కారం, రైతులకు 2 లక్షల రుణమాఫీ పై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి దేవేందర్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలో గల ఎస్ఆర్ గార్డెన్ లో తెలంగాణ రైతు సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఈడగొట్టి ఒడ్డెన్న అధ్యక్షతన గురువారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దేవేందర్ సింగ్ మాట్లాడుతూ. రుణమాఫీ పొందని రైతులకు వెంటనే 2 లక్షల రుణమాఫీ చేయాలని, మండలంలో అనేక గ్రామాలలో



అసైన్మెంట్ భూముల సమస్యలు ఉన్నాయని, సాదా బైనామాలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించి అసైన్డ్ భూములకు సంబంధించి అందరికీ డిజిటల్ పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వాలని, రైతుబంధు నిధులను విడుదల చేయాలని, యాసంగి పంటలు పూర్తయ్యే వరకు యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచి, సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనియెడల రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఈడగొట్టి సాయిలు, నాగన్న, శ్రీనివాస్, సాయిలు, లక్ష్మణరావు, వసంత్, భూమన్న, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామానికి చేరిన మృతదేహం

## - సహకరించిన ప్రభుత్వ సలహాదారులు



**సూర్య-నవీపేట్**

మండలంలోని యంచ గ్రామానికి చెందిన గొల్ల అబ్బయ్య మృతదేహం గురువారం రాత్రి స్వగ్రామానికి చేరింది. బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం గల్ఫ్ దేశమైన ఒమన్ కు కంపెనీ వీసా పై వెళ్లిన అబ్బయ్య తరువాత కంపెనీ వదిలేసి కలివిలి పనిలో చేరాడు. కలివిలి పనిలో చేరిన తర్వాత 15 రోజుల వరకు ఇంటికి ఫోను రాకపోవడంతో ఆందోళనకు గురైన భార్య సావిత్రి ఏజెంట్ కు ఫోన్ చేయగా ఒమన్ దేశంలో గల కంపెనీకి ఫోన్ చేసిన ఏజెంట్ అబ్బయ్య మృతి చెందిన విషయాన్ని భార్యకు తెలిపారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న భార్య సావిత్రి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడం కోసం స్థానిక సర్పంచ్ బేగరి సాయిలుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సుదర్శన్ రెడ్డిని ఆశ్రయించి ఆయన దృష్టికి తీసుకెళ్లగా హుటాహుటిన సీఎం సహాయ నిధి ద్వారా 1లక్ష 50 వేల రూపాయల చెక్కును బాధితురాలకు అందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి మన దేశం ఎంబసీతో మాట్లాడి మృతదేహం త్వరగా రావడానికి కృషి చేశారు.దీంతో గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు అబ్బయ్య మృతదేహం చేరుకుంది. మృతదేహాన్ని విమానాశ్రయం నుండి ప్రభుత్వం తరపున ఎటువంటి ఖర్చులు లేకుండా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసి మృతుడి స్వగ్రామం యంచ కు తీసుకువచ్చారు. ఒమన్ నుండి అబ్బయ్య మృత దేహం ఇంటికి చేరడానికి ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి చాలా సహాయం చేశారని పేర్కొంటూ స్థానిక సర్పంచ్ బేగరి సాయిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబం తరపున స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బతుకుదెరువు కోసం ఒమన్ దేశం వెళ్లిన గొల్ల అబ్బయ్య శవమై స్వగ్రామం చేరడం గ్రామస్తులను కలిసివేసింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గొల్ల లాలు యాదవ్, గొల్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ తహసిల్దార్ గా అనిరుద్

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండల నూతన తహసిల్దారుగా అనిరుద్ బాధ్యతలను స్వీకరించారు ఈయన నిజామాబాద్ రూరల్ తాహసిల్దారుగా పనిచేస్తూ వేల్పూర్ కు బదిలీపై వచ్చారు. బదిలీపై వచ్చిన తహసిల్దార్ ను సిబ్బంది స్వాగతం పలికారు.

## అర్చకుల క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు కామారెడ్డి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ చేతుల మీదుగా అర్చకుల క్యాలెండర్ ఆవిష్క రణ జరిగింది ఈ సందర్భంగా పూజారులు ఇక్కడికి రావడం చాలా సంతోషం అందరికీ ఆదర్శంగా ఉండాలని జ్ఞానవంతులుగా ఉన్నవారు ఆదర్శంగా నిలుస్తారన్నారు ఏదైనా జ్ఞానం లేనిది అంతా శూన్యం జ్ఞానవంతుడు అన్ని రంగాల్లో ముందు ఉంటాడు కులంతో పని లేకుండా అన్ని కులాల వారు కూడా జ్ఞానాన్ని నేర్చుకుంటే బాగుంటుంది పండితుడు కావాలంటే కఠినంగా నియమి నిష్ఠలతో ఉండాలి అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజనప్ప రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీర్లవంచ కృష్ణమాచార్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీష్ జిల్లా కార్యవర్గ సభ్యులు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## మురికి కాలువను శుభ్రం చేయించిన సర్పంచ్

**సూర్య రెంజల్**



గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజల సమస్యను పరిష్కరించేందుకై పెద్ద మురికి కాల్వను శుభ్రం చేయించినట్లు సర్పంచ్ ధనూరి నర్సవ్వ అబ్బయ్య తెలిపారు. గురువారం రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల పక్కన గల పెద్ద మురికి కాలువను చెరువు వరకు జెసిపి సహాయంతో శుభ్రం చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. గత ప్రభుత్వంలో చేయని అభివృద్ధిని పనులను, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఆమె వెంట వార్డు సభ్యురాలు, పంచాయతీ కార్యదర్శి షేక్ సలాం, సిబ్బంది ఉన్నారు.

## మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన

### - రవాణా శాఖ అధికారి

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు-2026ను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కుప్రియల్ లో ని మహాత్మ గాంధీ జ్యోతిబా పూలే పాఠశాల నందు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ఇర్షాద్, కృష్ణ తేజ,రఫీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. పాదచారులుగా, బస్సులు మరియు ఇతర వాహనాలలో ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సరళమైన భాషలో విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. చిన్న వయసులోనే రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ కమిషనర్ జన్మదిన వేడుకలు

**సూర్య బాల్కొండ**




నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పీ. సాయి చైతన్య ఐ.పీ.ఎస్ జన్మదినం సందర్భంగా బాల్కొండ పోలీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు, బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మహతి ఆశ్రమంలో పిల్లలకు నోటు పుస్తకాలు పెన్నులను అందజేశారు..ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎస్.ఐ కె. శైలేంధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సాయి పల్లకి సేవ

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ రెవెన్యూ శివారులో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ సాయి బాబా దేవాల యంలో గురువారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఉదయం గోవు పూజ నిర్వహిం చారు. ధ్యాన మందిరం లో ఘనంగా భజనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా ఆలయం భక్తులతో సందడిగా మారింది. బొంపల్లి హేమలత గంగాధర్ గుప్తా (వేల్పూర్), మీల శ్రావ్య నాగరాజు (ఆర్మూర్), సామ శ్రీహిత (వేల్పూర్) పుట్టినరోజు సందర్భంగా శాశ్వత అన్నదాతలుగా నిలిచారు. తదనంతరం ఆలయ అర్చకుడు అనురాగ్ పాండే శాశ్వత అన్నదాతలను శాలువా కప్పి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అభివృద్ధి కమిటీ క్రియాశీల కార్యవర్గ సభ్యుడు ఇరుపాజి దామోదర్ గౌడ్ భక్తులకు భీష్మ ఏకాదశి ప్రాధాన్యతను వివరించారు. ధ్యాన మందిరం నుండి పల్లకి సేవ నిర్వహిస్తూ ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ..సచ్చిదానందా రాజాధిరాజా... అంటూ భజన పాటలు పాడుతూ ఆనందంగా వలయాకారంగా నృత్యాలు చేశారు. ఈ పల్లకి సేవలో ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భజన కళాకారులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండలం నూతన తహసిల్దారిగా బాధ్యతలను స్వీకరించిన అనిరుద్ ను వేల్పూర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం కోసం శ్రమించే ఎమ్మార్పీఎస్ నాయకుల వివరాలను తహసిల్దార్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తెడ్డు శివరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బక్కోళ్ల ప్రశాంత్, అధికార ప్రతినిధి కేశపురం సుమన్, సీనియర్ నాయకులు బాలకిషన్, కంది పరమేష్ ,దార్ల సుజిత్, దార్ల సురేందర్, దార్ల సుమన్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఉపసర్పంచ్ చేయూత

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన నర్సోల్ల నర్సవ్వ అనే మహిళ మూడు రోజుల క్రితం మృతి చెందగా, నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ స్వామి గురువారం ఆమె పెద్దకర్మ నిమిత్తం కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఉప సర్పంచ్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రంలో వార్డ్ సభ్యులు, నాయకులు ఉన్నారు

## ఎం పి ఓ సాయిలు కు సన్మానం

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండలంలో మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న సాయిలు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగుల ప్రశంస పత్రాన్ని అందుకున్నందున ఆయనను అంక్సాపూర్ గ్రామ సర్పంచ్ తీట్ల శ్రీనివాస్ అక్లూర్ సర్పంచ్ జిల్లా జనార్దన్ శాలువా తో సన్మానించారు. ఆయన మండలానికి చేసిన సేవలను కొనియాడారు.

# మాతృ మరణాల కారణాలు గుర్తించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

జిల్లా సమీకృత అధికారుల కార్యాలయంలో గురువారం అడిషనల్ కలెక్టర్ మధు మోహన్ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలల కొకసారి నిర్వహించే మాతృ మరణాలు, శిశు మరణాలు, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ పై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. జిల్లాలో ఏప్రిల్ నుండి డిసెంబర్ 2025 వరకు మొత్తం 8 మాతృ మరణాలు సంభవించినట్లు తెలిపారు. వాటిలో 6 ఆసుపత్రుల్లో, ఒకటి ఇంటిలో, ఒకటి ప్రయాణ సమయంలో జరిగాయని వివరించారు. ఈ మాతృ మరణాలు దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (2), డోంగ్లి (2), బీర్కూర్, రాజంపేట, నిజాంసాగర్, పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున జరిగినట్లు తెలిపారు.మాతృ మరణాలకు గల కారణాలపై అడిషనల్ కలెక్టర్‌కు పూర్తి వివరాలు సమర్పించగా, గర్భిణీల ఆరోగ్య పరిస్థితులు, నిర్వహించిన పరీక్షలు, ఐరన్--ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రల పంపిణీ, వినియోగం గురించి వివరించారు. మాతృ మరణాలకు ప్రధాన కారణాలుగా సెప్సిస్, సెప్టిక్ షాక్, మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్, అధిక రక్తపోటు, షుగర్, తక్కువ హెమోగ్లోబిన్, సెకండరీ పీపీహెచ్, ఐబీపీ వంటి కారణాలు ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్




మధు మోహన్ మాట్లాడుతూ, మాతృ మరణాల కారణాలను గుర్తించి, ఇకపై అలాంటి మరణాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడమే ఈ సమీక్ష సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గర్భిణీలకు రెగ్యులర్ ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్, హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, అధిక ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రసవానికి సంబంధించిన స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో ఈసీజీ, 2డీ ఈకో, ఫీటల్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని, సరైన సమయంలో సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ఎంసీహెచ్ కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు.జిల్లాలో 14 సీడీఆర్ (శిశు మరణాలు) జరిగినట్లు తెలిపారు. లింగంపేట్, బిబిపేట్ తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన ఈ మరణాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ విద్యా సూచించారు. జిల్లాలో మాతృ--శిశు మరణాలు జరగకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.టీహెచ్ఎస్ డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ పేషంట్ ఎడ్యుకేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఎనీమియా ప్రమాదాలు, శిశువులకు పాలు ఇచ్చే సరైన పద్ధతులు, నిద్రపోతూ పాలు ఇవ్వకూడదని, రెగ్యులర్ ఏఎన్సీ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. ప్రమాదకర లక్షణాలు కనిపించిన వెంటనే గర్భిణీలను జీజీహెచ్ లేదా ఎంసీహెచ్ కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో డాక్టర్ విజయరాజ్, డాక్టర్ శ్రీలత, ఎండీఆర్--సీడీఆర్ కమిటీ సభ్యులు ప్రమాదకర లక్షణాలు, నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి 50 శాంపిళ్లు టీ--ల్యాబ్‌కు పంపించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. సికిల్ సెల్ వ్యాధికి సంబంధించిన రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రతి ఏఎన్సీకి ఈసీజీ, టీఫ్, 2డీ ఈకో, ఫీటల్ పరీక్షలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయరాజ్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఏమీ, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ ప్రవీణ్, డెమో వేణుగోపాల్, చలపతి, శ్రీధర్, నయీమ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయి

**- తెలంగాణ జాతిపిత కేసీఆర్ గారికి నోటీసులు ఇవ్వడం తెలంగాణ అస్తిత్వానికే అవమానం**

**- కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ డ్రామాలు - రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం**

**సూర్య వేల్పూర్**

తెలంగాణ సాధకుడు కేసీఆర్ కి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ వేల్పూర్ మండల కేంద్రంలో టిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ ను మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డితగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ గారికి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయని వారు మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే కాళేశ్వరం కమిషన్లని, సిట్ అని, ఫోన్ ట్యాపింగ్ అని రకరకాల పేర్లతో కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, ఇప్పుడు ఏకంగా కేసీఆర్ గారిని వేధిస్తున్నారని ఆరోపించారు.ప్రస్తుత



మంత్రివర్గాన్ని "దండుపాళ్యం బ్యాచ్"గా అభివర్ణిస్తూ, వారు రోజుకో కుంభకోణానికి పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దొరికింది దొరికినట్టు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు గారు ఇప్పటికే బొగ్గు స్కామ్, సోలార్ పవర్ స్కామ్, సింగరేణి డీజిల్ స్కామ్, మరియు ఎక్సైజ్ (మద్యం) స్కామ్‌లను బయటపెట్టారని గుర్తుచేశారు. ఈ స్కామ్‌ల నుండి తప్పించుకోవడానికి, ప్రజల దృష్టి మరల్చడానికి కేసీఆర్ గారికి నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు పెన్షన్లను 200 నుండి 2000 చేసిన ఘనత కేసీఆర్ గారిదని, రైతులకు 24 గంటల కరెంట్, సాగునీరు, ఎరువులు, రైతుబంధు అందించి రైతులను ఆదుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కోట్లాది మంది ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న నాయకుడిని, పోలీసులను అడ్డం పెట్టుకొని అవమానించడం దారుణమన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు పనిచేయకుండా, కేసుల చుట్టూ తిరిగేలా చేయాలనే కుట్రతోనే రేవంత్ రెడ్డి ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.కేసీఆర్ ను వేధిస్తే ఆ ఉసురు ఈ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి తగలకుండా పోదని హెచ్చరించారు. న్యాయం, ధర్మం తమ వైపే ఉన్నాయని, ఈ కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. యావత్ తెలంగాణ సమాజం మరియు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ గారి వెంటే ఉంటుందని తెలియజేశారు.

## పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

**-మాజీ ఎమ్మెల్యే**

**సూర్య- బిక్కనూర్**

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా నని, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చెప్పారు. గురువారం మండలం లోని పలు గ్రామాలలో ఆయన పర్యటించి పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. మొదటగా బాగిర్తి పల్లి మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల నాగ లక్ష్మి భర్త స్వామి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని, మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## నూతన తాహసిల్దారు కు సన్మానం

**సూర్య వేల్పూర్**

వేల్పూర్ మండల నూతన తాహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అనిరుద్ ను మీసేవ నిర్వాహకులు సన్మాన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కు మీ సేవ నిర్వాహకుల పరిచయాలను చేసుకున్నారు. అనంతరం వేల్పూర్ మండల మీసేవ నూతన క్యాలెండర్ ను తాహసిల్దార్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. అదేవిధంగా సర్పంచ్ల ఫోరం ఆధ్వర్యంలో తహసిల్దార్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు మరియు సర్పంచుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

## బోధన్ మునిసిపల్ ఎన్నికలు

**- మాజీ చైర్‌పర్సన్, భర్త నామినేషన్లు దాఖలు**

**సూర్య బోధన్**



బోధన్ మునిసిపల్ ఎన్నికలలో భాగంగా, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ తూము పద్మా శరత్ రెడ్డి 35వ వార్డు నుండి, ఆమె భర్తతూము శరత్ రెడ్డి 25వ వార్డు నుండి నామినేషన్లు దాఖలు చేశారు. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా బోధన్ పట్టణంలోని 38 వార్డులలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. రెండోరోజు గురువారం నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 72 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు చెప్పారు. ఆప్ - 1, బిజెపి - 12, కాంగ్రెస్ - 30, ఎంఐఎం - 9, బిఆరఎస్ - 20 నామినేషన్ పత్రాలు వచ్చినట్టు పేర్కొన్నారు. మొదటిరోజు నామినేషన్లు రాలేదన్నారు.

## ప్లాస్టిక్ ప్రాణాంతకం

**- ప్రముఖ పర్యావరణవేత్త ప్రభాకర్**

**సూర్య కామారెడ్డి టౌన్.**



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండవ యనిట్ విద్యార్థుల శీతాకాల ప్రత్యేక శిబిరం రెండవ రోజు కామారెడ్డి మండలం లింగాయపల్లి గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో, వాలంటీర్లు గ్రామంలోని గుడి పరిసరాలను శుభ్రం చేశారు.మధ్యాహ్నం సెషన్ కు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పర్యావరణవేత్త రిటైర్డ్ బోటనీ అధ్యాపకులు ప్రభాకర్ గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పైన అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జూట్ బ్యాగులను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల జరిగే నష్టాలను వివరంగా తెలిపారు. అలాగే లింగాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గోపాలరావు మాట్లాడుతూ యువత యొక్క అమూల్యమైన సమయం సెల్ ఫోన్ కు కేటాయించకుండా కష్టపడే తత్వానికి పెంపొందించుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

## ఎడపల్లి కెనాల్‌లో బాలిక మ తదేహం కలకలం

**సూర్య బోధన్**



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని ఏఆర్పి క్యాంపు గ్రామ శివారులో ఉన్న డి46 కెనాల్‌లో గురువారం గుర్తు తెలియని బాలిక మ తదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు పదేళ్ళలోపు వయసున్న బాలికగా అంచనా వేస్తున్నారు. బాలిక గుర్తింపు ఇంకా లభించలేదని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సమాచారం తెలిసిన వారు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## జలాల్పూర్ గ్రామంలో వీధి దీపాల మరమ్మత్తులు పూర్తి

**సూర్య బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని జలాల్పూర్ గ్రామ వీధి దీపాలు వెలగడంలో ఇబ్బందులు తొలగి పోయాయి.స్థానిక సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ తీగల అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి మరమ్మత్తులు ఉన్న వాటినీ తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా కారోబార్ వేణుగోపాల్, జే ఎల్ ఎం నరేందర్, వాటర్ మెన్ ప్రదీప్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు,

## పల్లె దావఖానా - స్థల పరిశీలన

**సూర్య మోపాల్**

మోపాల్ మండల్ బోర్గం (పీ) గ్రామంలోని పల్లె దవఖానా స్థలాన్ని ఆర్డీవో రాజేంద్ర కుమార్ పరశీలించారు. నూతన పల్లె దావఖానా అందులోనే కొనసాగుతున్న శాఖా గ్రాంతాలయ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. స్థల వివాదం కారణంగా నిర్మాణాలు ఆగిపోయాయి.